# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 17, ఫిబ్రవరి 2026




### సమస్యలను పరిష్కరించాలని

# గురుకుల పాఠశాల విద్యార్థుల నిరసన

## కుమురం భీం చౌరస్తాలో నాలుగు గంటల పాటు ధర్నా



**తిర్యాని, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**

తిర్యాని మండలంలోని చింతపల్లి గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం గురుకుల పాఠశాలలోని విద్యార్థులు మండల కేంద్రంలోని స్థానిక కొమరం భీం చౌరస్తాలో నిరసన చేపట్టారు. పాఠశాలలో నెలకొన్న ప్రధాన సమస్య అయిన నీటి సమస్యతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని విద్యార్థినీలు పాఠశాల నుండి ఖాళీ బాకెట్లతో ర్యాలీగా బయలుదేరి కొమురం భీం చౌరస్తాలో ధర్నా నిర్వహించి నిరసన తెలియజేశారు. కాగా వీరికి గిరిజన సంఘాల నాయకులు గుణవంత్, భగవంతురావు, మాజీ జెడ్పిటిసిలు మాత్రం చంద్రశేఖర్, కమల, మాజీ పిఎసిఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ గిరిజన నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు విద్యార్థుల ధర్నాకు మద్దతు ప్రకటించారు. సుమారు నాలుగు గంటల పాటు ఎండలో కూర్చొని నినాదాలు ధర్నా నిర్వహించారు. దీంతో ఎండ వేడిమికి తట్టుకోలేక ముగ్గురు విద్యార్థులు స్పృహ తప్పిపోవడంతో 108 వాహనంలో తిర్యాని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంటనే స్పందించిన ఆర్‌సిఓ సమస్యను పరిష్కరించాలని ఆసిఫాబాద్ డిసిఓ రమ్యకృష్ణ విద్యార్థుల దగ్గరికి పంపించారు. తాహశీల్దార్ ఆర్ శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేష్‌లతో కలిసి డిసిఓ రమ్యకృష్ణ మిగతా 2లో..



### ప్రమాణ స్వీకారానికి వెళ్తున్న

# కౌన్సిలర్లను అడ్డుకున్న పోలీసులు

- భారీగా బలగాలను మోహరించిన పోలీసులు
- రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే సుమన్
- మున్సిపాలిటీ వద్ద కాంగ్రెస్ శ్రేణులు
- నిరసనలు వ్యక్తం చేసిన సీపీఐ నాయకులు

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**

క్యాతన్ పల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వేళ హైడ్రామా నెలకొంది. దీనితో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా క్యాతన్ పల్లి వైపుకు తిరిగాయి. సోమవారం బి.ఆర్.ఎస్, సీ.పి.ఐ కౌన్సిలర్‌లు గెలుపొందిన 14 మంది మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసేందుకు గెలిచిన బీఆర్ఎస్, సీపీఐ కౌన్సిలర్లతో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మున్సిపల్ కార్యాలయనికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. గెలిచిన కౌన్సిలర్ల వెంట ఎవరు వలదంటూ సుమన్‌ను అడ్డుకోవడంతో బీఆర్ఎస్, సీపీఐ శ్రేణులకు పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో బాల్క సుమన్, ఏఐటీయూసీ సీతారామయ్య బీఆర్ఎస్, సీపీఐ శ్రేణులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. మున్సిపాలిటీ కార్యాలయనికి సమయానికి మిగతా 2లో..

# ప్రశాంతంగా మేయర్, చైర్మన్ల ఎంపిక ప్రక్రియ

★ మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**



2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 1 నగరపాలక సంస్థ, 4 పురపాలక సంఘాలకు జరిగిన ఎన్నికలలో భాగంగా మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్‌తో కలిసి ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు జరిగిన ఎన్నికలలో గెలుపొందిన కార్పొరేటర్లతో మంచిర్యాల పట్టణంలోని నగరపాలక సంస్థ కార్యాలయ హాల్‌లో ఎన్నికల పరిశీలకులు కె. గంగాధర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం మేయర్ గా ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్‌గా చల్లా రమ్య లను ఎన్నుకున్నారని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో గెలుపొందిన కౌన్సిలర్లతో బెల్లంపల్లి మున్సిపల్ మిగతా 2లో..




### బొక్కేవాగు చెరువులో

# విషప్రయోగం

**26 పక్షుల వధ నలుగురికి 14 రోజుల న్యాయ నిర్బంధం**

- పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :



2లో..

## సమస్యలను పరిష్కరించాలని గురుకుల పాఠశాల విద్యార్థుల నిరసన

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థులతో, గిరిజన సంఘాల నాయకులతో మాట్లాడిన ఆమె ఆర్‌సిఓ వస్తున్నారని సమస్యల పరిష్కారం చేసేంతవరకు ఇక్కడనే ఉంటారని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమింపజేసి పాఠశాలకు వెళ్లారు. పాఠశాలకు విచ్చేసి విద్యార్థులతో మాట్లాడారు నీటి సమస్యతోపాటు పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమింప చేశారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌బి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు కృష్ణ, నరేష్, గిరిజన సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా మేయర్, ఛైర్మన్ల ఎంపిక ప్రక్రియ

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, కమిషనర్ సంపత్ ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించి చైర్ పర్సన్‌గా దావ స్వాతి, వైస్ చైర్ పర్సన్‌గా రాగంశెట్టి సత్యనారాయణ లను ఎన్నుకున్నారని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులలో గెలుపొందిన కౌన్సిలర్లతో చెన్నూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం అనంతరం చైర్ పర్సన్‌గా పెద్దింటి పద్మ, వైస్ చైర్ పర్సన్ గా నాయకపు వినయ్‌లను ఎన్నుకున్నారని తెలిపారు. లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులలో గెలుపొందిన కౌన్సిలర్లతో లక్షెట్టిపేట మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం చైర్ పర్సన్‌గా దొంత అంజలి, వైస్ చైర్ పర్సన్‌గా మోతుకూరి రాజేశ్వరిలను ఎన్నుకున్నారని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 22 వార్డులకు ఎన్నికలు జరగగా సోమవారం రోజు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో కోరం లేక ప్రమాణ స్వీకారం, చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక ప్రక్రియను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను జిల్లాలో అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అప్పాల కావ్య ఏకగ్రీవ ఎన్నిక

**నిర్మల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

నిర్మల్ మున్సిపాలిటీలో నూతన పాలకవర్గ ఎన్నికల ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు నిర్వహించిన ఎన్నికల్లో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారిగా వ్యవహరించిన పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్ నేతృత్వంలో ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా మున్సిపాలిటీలోని 42 మంది వార్డు కౌన్సిలర్ల చేత అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశానికి జనరల్ అబ్జర్వర్ వీరారెడ్డి హాజరయ్యారు. కోరం పూర్తి కావడంతో ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. చైర్‌పర్సన్ పదవికి అప్పాల కావ్య పేరును కత్తి నరేందర్ ప్రతిపాదించగా, ఎం.డి. ఇమాన్ ఉల్లా బలపరిచారు. వేరెవరూ పోటీలో లేకపోవడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. వైస్ చైర్‌పర్సన్‌గా అప్పాల గణేష్ చక్రవర్తి పేరును తాజ్ అద్దీన్ ప్రతిపాదించగా, గొల్లా గోపినాథ్ బలపరిచారు. దీంతో ఆయన కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం ప్రత్యేక అధికారి నూతన చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్‌లకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డి.ఈ. హరి భువన్, తాహసిల్దార్ రాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



### ప్రమాణ స్వీకారానికి వెళ్తున్న

# కౌన్సిలర్లను అడ్డుకున్న పోలీసులు

(మొదటిపేజీ తరువాయి)

చేరుకోకుండా పోలీసులు అడ్డుకోవడంతో బీఆర్ఎస్, సీపీఐ కౌన్సిలర్లతో సహా సుమన్ తిరిగి వెనుదిరిగారు.

### బీఆర్ఎస్,సీపీఐ కౌన్సిలర్లను అడ్డుకునేందుకు కాంగ్రెస్ శ్రేణులు..

గెలిచిన బీఆర్ఎస్,సీపీఐ కౌన్సిలర్లతో వస్తున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అడ్డుకునేందుకు మున్సిపాలిటీ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున్న కాంగ్రెస్ శ్రేణులు రావడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అధికారులు పోలీసు బలగాలను భారీగా మోహరించారు.

### పుర కార్యాలయం ముందు నిరసన తెలిపిన రామడుగు..

గెలిచిన బీఆర్ఎస్,సీపీఐ కౌన్సిలర్లను సమయ్సనికి మున్సిపాలిటీ కార్యాలయానికి రాకుండా అధికార పార్టీ కార్యకర్తలు,పోలీసులు అడ్డుకున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామడుగు లక్ష్మణ్ అన్నారు.అనంతరం కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. కాగా బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ వారిని కార్యాలయం ముందు నుండి వెళ్లగొట్టాడు.

### మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా

క్యాతన్ పల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మంగళవారనికి వాయిదా పడింది. గెలిచిన బిఆర్ఎస్, సీపీఐ కౌన్సిలర్లు సమయానికి హాజరు కాకపోవడంతో ఎన్నికల అధికారి,మందమర్రి తహశీల్దార్ సతీష్ నూతన పాలక మండలి చైర్మన్,వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు.

### సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్న వీడియో

చైర్మన్ ఎన్నిక జరిగే సమయంలో క్యాతన్ పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో అప్పటికే ఉన్న మంచిర్యాల కాంగ్రెస్ డిసిసి సభ్యుడు పిన్నింటి రఘునాథ రెడ్డి ని పోలీసులు బయటకు వెల్లగొడుతున్న వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ కావడంతో పుర ప్రజలు ఒక్కసారిగా విస్మయానికి లోనయ్యారు.

## ప్రజా తీర్పును అపహాస్యం చేస్తున్న మంత్రి: బాల్క సుమన్

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**

బిఆర్ఎస్‌కి 10సీట్లు, సీపిఐకి 4 సీట్లలో ప్రజలు ఓట్లు వేసి గెలిపించి స్పష్టమైన మెజారిటీతో ఇచ్చిన ప్రజా తీర్పును మంత్రి వివేక్ వెంకటస్వామి, అపహాస్యం చేస్తున్నాడని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుమన్ మండిపడ్డారు. సోమవారం కౌన్సిల్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని అడ్డుకొని రాజ్యాంగాన్ని అబాసు పాలు చేస్తున్న మంత్రి తీరు ను విలేఖరుల సమావేశంలో దుయ్యబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గెలిచిన కౌన్సిలర్లు చైర్మన్‌ను ఏర్పాటు చేసేందు క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయనికి వెళ్లే క్రమంలో పోలీసులు అడ్డుకోవడంపై మండిపడ్డారు. మంత్రి దృష్ట సంప్రదాయనికి తెరలేపుతున్నారని అన్నారు.ప్రజల తీర్పును అడ్డుకోవడం దురదృష్టకరమని, ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.కాంగ్రెస్ కార్యకర్తలు,పోలీసుల తీరుపై ఉన్నతాధికారులకు బిఆర్ఎస్, సీపీఐ శ్రేణులతో ఫిర్యాదు చేయనున్నట్లు సుమన్ తెలిపారు.




విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న బాల్క సుమన్

### ఆరు నూరైనా మాటమీద ఉంటాం: సీతరామయ్య

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్, సీపీఐ పొత్తు ఉండటంతో ప్రజలకు తెలిసిందేనని ఆరు నూరైనా సీపీఐ మాటమీద ఉంటుందని ఏఐటియుసి రాష్ట్ర నాయకులు నిక్కచుగా తేల్చి చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ చైర్మన్‌గా ఎన్నుకునే క్రమంలో సిపిఐ పూర్తి మద్దతు ఇస్తుందని జిల్లా కార్యవర్గ సభ్యులు కలవేని శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, డాక్టర్ రాజా రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## బొక్కేవాగు చెరువులో విషప్రయోగం

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండలం ఎల్లూర్ గ్రామంలోని బొక్కేవాగు చెరువు వద్ద విషప్రయోగం చేసి వలస పక్షులను హతమార్చిన నలుగురు వ్యక్తులను అటవీశాఖ అధికారులు నేరం చేస్తున్న సమయంలోనే పట్టుకున్నారు. వారి వద్ద నుండి మొత్తం 26 మృత పక్షులను స్వాధీనం చేసుకున్నారు. ఫారెస్ట్ బీట్ అధికారి సతీష్, వాహన చోదకుడు వాజీదులకు అందిన ఖచ్చితమైన సమాచారంతో చెరువు పరిసరాల్లో తనిఖీలు చేపట్టగా, నిందితుల వద్ద ఉన్న సంచుల్లో 26 చనిపోయిన పక్షులు లభించాయి. వీటిలో 19 సౌత్ పింటెయిల్ (వలస బాతులు), 7 బూడిద తల నీటికోళ్లు ఉన్నాయి.

### క్రిమిసంహారక మందులతో వేట

విచారణలో బయల్పడిన వివరాల ప్రకారం నిందితులు .. ప్రకాష్ సర్కార్ (40), నజ్రుల్ నగర్ కాగజ్ నగర్ మండలం, .. కుశాల్ మండల్ (20), నజ్రుల్ నగర్.. తుషార్ దే (21), రామ్ నగర్, నజ్రుల్ నగర్ .. తరపధర్ సంజిత్ (42), రామ్ నగర్, నజ్రుల్ నగర్ ఈ నలుగురు వ్యక్తులు లోడుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పనుల నిమిత్తం వచ్చి, ఫిబ్రవరి 13 సాయంత్రం పంట పొలాలకు చల్లే క్రిమిసంహారక మందును వడ్ల గింజలతో కలిపి చెరువులోని తామర ఆకులపై ఉంచినట్లు అంగీకరించారు. వాటిని తిని చనిపోయిన పక్షులను వండి తినేందుకు, కొంత భాగాన్ని అమ్మేందుకు ఈ దారుణానికి పాల్పడినట్లు తెలిపారు.

### వాహనాలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

నిందుతుల వద్ద నుండి రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మృత పక్షులకు వెటర్నరీ సర్జన్ల సమక్షంలో శవ పంచనామా నిర్వహించారు.

### వన్య ప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు

నిందుతులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేసి సోమవారం న్యాయస్థానం ముందు హాజరుపరచగా 14 రోజుల న్యాయ నిర్భంధం విధించినట్లు ఎఫ్ఆర్వో అనిల్ కుమార్ తెలిపారు. ఈ దర్యాప్తులో ఎఫ్ఎస్ఓ జగన్మోహన్, బీట్ అధికారులు మనోహర్, సంగదీప్, లచ్చన్నలతో పాటు అనిమల్ ట్రాకర్ రాజు పాల్గొన్నట్లుగా తెలిపారు.

### పక్షుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**- ఎఫ్ఆర్వో అనిల్ కుమార్**

పర్యావరణ వ్యవస్థను కాపాడడంలో స్థానిక పక్షులతో పాటు విదేశీ వలస పక్షులు కీలక పాత్ర పోషిస్తాయని వాటిని రక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ప్రతి గ్రామంలో పటిష్టమైన సమాచార వ్యవస్థ ఏర్పాట్లు చేసినట్లు, అటవీ నేరలకు పాల్పడిన వారు ఎట్టి పరిస్థితుల్లో తప్పించుకోలేరని హెచ్చరించారు.



ఎంపిక అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లతో ఎమ్మెల్యే కోవలక్ష్మి



మున్సిపల్ కార్యాలయం ముందు పోలీసుల భారీ బందోబస్తు

### ఉత్కంఠకు తెర....

# బీఆర్ఎస్‌కు ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ పీఠం

**✪ వ్యూహాత్మకంగా వ్యవహరించిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

తీవ్ర ఉత్కంఠ రేపిన ఆసిఫాబాద్ పురపాలక సంఘం పీఠంను భారతీయ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) దక్కించుకుంది. మున్సిపల్ చైర్మన్ గా మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ గా ఎండీ. అహ్మద్ లు ఎన్నికయ్యారు. ఆసిఫాబాద్ పట్టణంలో తొలిసారి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికలతో సందడి వాతావరణం నెలకొంది. సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక పురపాలిక సంఘం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమంను ఆసిఫాబాద్ ఎన్నికల, పురపాలక సంఘం ప్రత్యేక అధికారి లోకేశ్వరరావు, మున్సిపల్ కమీషనర్ గజానంద్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. మొదటగా కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించారు. గెలుపొందిన 20 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యురాలు ఎమ్మెల్యే కోవలక్ష్మి హాజరయ్యారు. పూర్తి కోరం ఉండటంతో ఈ ఎన్నికను నిర్వహించారు. 10 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యురాలి మద్దతుతో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. డిప్యూటీ చైర్మన్ గా అదే పార్టీకి చెందిన ఎండి. అహ్మద్ ఎన్నికయ్యారు. మున్సిపల్ చైర్మన్ పిఠాన్ని దక్కించుకోవడంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి వ్యూహాత్మకంగా వ్యవహరించారు.



ఆసిఫాబాద్ పురపాలక చైర్మన్ ఆకాశ్



ఆసిఫాబాద్ పురపాలక వైస్ చైర్మన్ అహ్మద్

### చైర్మన్ పీఠంపై సందిగ్ధత.....

ఆసిఫాబాద్ పురపాలక సంఘంలో బీఆర్ఎస్ 20 వార్డులకు గాను 9 వార్డులు అత్యధికంగా గెలిచినప్పటికీ మ్యాజిక్ సంఖ్యను చేరుకొని పీఠాన్ని కైవసం చేసుకుంటుందా అనే విషయంలో సందిగ్ధత కొనసాగింది. ఎట్టి పరిస్థితుల్లోను చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేసినా సోమవారం చోటుచేసుకున్న పరిణామాలు ఆసక్తిని రేపాయి. కానీ మరో వైపు కాంగ్రెస్ స్వతంత్రులతో కలిసి ఎలాగైనా తమకు అనుకూలంగా మలచుకోవాలనే విధంగా చక్రం తిప్పారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే రహస్యంగా క్యాంపులు నిర్వహించారు. దీంతో కాంగ్రెస్ చైర్మన్ అభ్యర్థి అబ్దుల్లాకు 7 గురికి గాను 6 గురు కౌన్సిలర్లు మాత్రమే మద్దతు తెలుపగా... నలుగురు స్వతంత్ర అభ్యర్థులతో కలిసి 10 మందికి చేరారు. బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి మెంగ్రే ఆకాశ్ కు 9 మంది కౌన్సిల్లర్లతో పాటు కాంగ్రెస్ పార్టీ కి చెందిన కౌన్సిలర్ గుండా స్నేహ మద్దతు తెలపడంతో ఎక్స్ అఫీషియో సభ్యురాలైన ఎమ్మెల్యే ఓటుతో 11కు చేరింది. దీంతో ఎన్నికల అధికారి టిఆర్ఎస్ అభ్యర్థి మెంగ్రే ఆకాశ్‌ను చైర్మన్‌గా ప్రకటించారు. చివరికి చైర్మన్ పీఠాన్ని బీఆర్ఎస్ దక్కించుకోవడంతో ఉత్కంఠకు తెరపడింది.



## శివాలయంలో అన్నదానం

### - క్రీడాకారులకు బహుమతుల ప్రధానం

**సిరికొండ, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. పండుగను పురస్కరించుకొని భక్తుల కోసం ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాలు, క్రీడా పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మండలంలోని ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ జాదవ్ దినేష్ సౌజన్యంతో శివాలయంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకున్న భక్తులు పెద్ద ఎత్తున ఈ అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అన్నదాత జాదవ్ దినేష్ కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. కొండాపూర్‌లోని పురాతన శివాలయం వద్ద శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ పోటీలు క్రీడాకారుల ఉత్సాహం మధ్య సాగాయి. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు ఆలయ కమిటీ సభ్యులు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి రూ. 10,000, ద్వితీయ బహుమతి రూ. 5,000, ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## పంట దిగుబడి రాక, అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

**సిరికొండ, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

పంట దిగుబడి సరిగా రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చే మార్గం తెలియక మనస్తాపానికి గురై ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిరికొండ మండలంలో చోటుచేసుకుంది. ఏఎస్సై రమేష్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని భీంపూర్ గ్రామానికి చెందిన దుర్వా సుంగు (30) తనకున్న ఐదు ఎకరాల సొంత భూమితో పాటు మరో పది ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పంట సాగు చేస్తున్నాడు. అయితే, ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాకపోవడంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే ఆదివారం తన పంట పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సుంగు మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.





## వైభవంగా మాజీ మంత్రి అల్లోల జన్మదిన వేడుకలు

### - తరలివచ్చిన సారంగాపూర్ నాయకులు

**సారంగాపూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

నిర్మల్ నియోజకవర్గ మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. సారంగాపూర్ మండలానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు నిర్మల్‌లోని ఆయన నివాసానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. మండల మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఐర నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడెల్లి పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సింగం భోజగౌడ్, మాజీ ఎంపీపీ అట్ల మహిపాల్ రెడ్డి, మాజీ చైర్మన్లు మాధవరావు, చందు, అలూరు సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, పతాని భూమేష్ పాల్గొన్నారు. అలాగే మాజీ మార్కెట్ చైర్మన్ దశరథ్ రాజేశ్వర్, మార్కెట్ డైరెక్టర్ అహ్మద్ ముక్తార్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ షాఫీ, అడెల్లి రాజేశ్వర్ రావు, హైమత్, కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సురేందర్, పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి గారిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## డిగ్రీ ఫలితాల్లో సాయి చైతన్య కళాశాల విద్యార్థుల ప్రభంజనం

**నేరడిగొండ, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

ఇటీవల కాకతీయ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో మండల కేంద్రంలోని సాయి చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ సామరాజ కిరణ్ రెడ్డి, కరస్పాండెంట్ కార్తీక్, వైస్ ప్రిన్సిపాల్ శరత్ అభినందించారు. మొదటి సెమిస్టర్ బీజడ్సీలో డి రాజేష్ 8.00 గ్రేడ్ పాయింట్లు, ఎంపీసీఎస్ విభాగంలో సిహెచ్ సాత్విక 7.92, బిఏలో జె రవికాంత్ 6.20 పాయింట్లు సాధించారు. మూడవ సెమిస్టర్ బీజడ్సీలో జి వెంకట లక్ష్మి 7.10, బిఏలో ఎస్ నిర్గుణ 6.11 పాయింట్లు సాధించి సత్తా చాటారు. ఐదవ సెమిస్టర్ ఫలితాల్లో బీజడ్సీ నుండి టి ప్రతిభ 6.90, ఎమ్ మమత 6.38, ఎంపీసీఎస్ విభాగంలో ఆర్ దీపిక 6.00, జి ప్రణతి 5.97, బిఏ విభాగంలో ఇ పూజ 6.20, జి మనీషా 6.16 గ్రేడ్ పాయింట్లు సాధించారు. ఈ విజయం వెనుక ఉన్న కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యాజమాన్యం ఆకాంక్షించింది.

## పార్టీ నుంచి ముగ్గురి సస్పెన్షన్

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

పార్టీకి నష్టం కలిగేలా ధిక్కరించిన ముగ్గురిని సస్పెండ్ చేసినట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు సుగుణ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రం లో స్థానికంగా మాట్లాడుతూ అసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పార్టీకి నష్టం కలిగేలా విప్ ధిక్కరించి బిఆర్ఎస్ కు ఓటు వేసిన 13వ వార్డు కౌన్సిలర్ గుండా స్నేహతో పాటు, దానికి సహకరించిన కాంగ్రెస్ యువజన జిల్లా అధ్యక్షుడు గుండ శ్యామ్, తిర్యాని మండల అధ్యక్షుడు అనిల్ గౌడ్ ను పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సస్పెన్షన్ ఉత్తర్వులను పిసిసికి పంపిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీకి ఎవరు కూడా నష్టం చేయకూడదని, అది కన్నతల్లికి చెడు చేసినట్లు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం అధ్యక్షుడు శ్యామ్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ ఉన్నారు.



మాట్లాడుతున్న డిసీసీ అధ్యక్షులు సుగుణక్క

## టీబీ నిర్ధారణకు ప్రత్యేక శిబిరం: డా. అశ్రీన్

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :**

పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని ఎల్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేడు క్షయవ్యాధి ( టీబీ ) రోగులను గుర్తించేందుకు ప్రత్యేక ఎక్స రే శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లుగా వైద్య అధికారి డాక్టర్ అశ్రీన్ తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్నావారు, దీర్ఘకాలంగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి సమస్యలతో బాధపడుతున్నవారు ఈ శిబిరాన్ని వినోయోగించుకోవాలని ఆమె సూచించారు. శిబిరంలో ఉచితంగా ఛాతీ ఎక్స రే పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన చికిత్స అందించానున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశన్ని స్వద్వినియోగం చేసుకోవాలని కోరారు.



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

## భక్తజన సందోహంతో కళకళలాడిన భద్రకాళి ఆలయం

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :**

పెంచికల్ పేట్ గ్రామంలోని పంచకళపురి క్షేత్రంలో వెలసిన భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో మహా శివరాత్రి జాతర సందర్భంగా సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారు, స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పిఠాధిపతి మూలమాటం శివప్రసాద్ ఆధ్వర్యంలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామివారికి అభిషేకం, అన్నబలి, మహానైవేద్యం, హారతి అర్చనలు ఘనంగా నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.



భక్తులకు అన్న ప్రసాదం అందజేస్తున్న రేఖ  పెంటన్న, కుటుంబ సభ్యులు

## ఆలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమం

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :**

పెంచికల్ పేట్ గ్రామంలోని పంచకళపురిలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే భద్రకాళి సమేత వీరభద్ర స్వామి జాతర సందర్భంగా బెజ్జూర్ మండలం బారేగూడ గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ రేణికుంట్ల రేఖ  పెంటన్న దంపతులు సోమవారం అమ్మవారు, స్వామివార్లను దర్శించుకుని ఆలయ పిఠాధిపతి శివప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతరకు వచ్చే భక్తులకు సురేఖ  పెంటన్న దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మహా ప్రసాదాన్ని స్వీకరించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అపోహాలు వీడి ప్రతి ఒక్కరూ రక్త దానానికి ముందుకు రావాలి

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**

జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల సహాయార్థం ఈ నెల 18వ తేది బుధవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు బెల్లంపల్లి పట్టణంలోని తాపీ సంఘ భవనంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ తెలిపారు. రక్త దానం చేయడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడగలమని అలాంటి రక్తాన్ని ఒకరు రక్తదానం చేయడం వల్లే సాధ్యమని అన్నారు. మంచిర్యాల రక్త నిధి కేంద్రంలో రక్త నిల్వలు లేక తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి గ్రస్తులు, అత్యవసర కేసుల్లో రక్తం అవసరమైన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిసి రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ఈ రక్తదాన శిబిరం విజయవంతం కొరకు ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు అపోహాలు వీడి రక్త దానానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

### శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ కార్మికుల

# సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**ఐఎన్టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు - ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ అధికారులకు వినతి**

**నస్పూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**

ఓపెన్ కాస్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న కనీస వసతుల సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఐఎన్టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ బి.జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్‌లో ఐఎన్టీయూసీ నాయకులు పర్యటించారు. అక్కడ పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను నాయకులు నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓపెన్ కాస్ట్ ఫిట్ కార్యదర్శి ఓరం జగన్ నేతృత్వంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో శంకర్ రావు మాట్లాడారు. సీహెచ్‌పీ, ఎలక్ట్రికల్, మెకానికల్ సెక్షన్లలో పని చేస్తున్న ఉద్యోగులకు సరైన రెస్ట్ షెల్టర్లు లేవని ఆయన వివరించారు. కార్మికులు తమ సామాన్లు భద్రపరుచుకునే గదులు, తాగునీరు, వాష్ రూమ్ వసతులు కల్పించాలని కోరారు. ఓపెన్ కాస్ట్ ప్రాంగణంలో సెక్షన్లు దూరంగా ఉన్నందున ప్రతి విభాగం వద్ద మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాలు, మోటార్ మెకానిక్ విభాగాల్లో మరమ్మతుల కోసం అవసరమైన స్పేర్ పార్ట్స్ తక్షణమే సరఫరా చేయాలి. సెలవు దినాల్లో పని చేసే మంత్లీ రేట్ ఉద్యోగుల వీక్లీ రెస్ట్ నిబంధనలను సడలించాలని, గతంలో ఉన్నట్లుగా మూడు నెలల కాలంలో ఎప్పుడైనా వీక్లీ రెస్ట్ తీసుకునే వెసులుబాటు కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ సమస్యలపై నాయకులు ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్ వెంకటేశ్వర్లును కలిసి విన్నవించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కేంద్ర నాయకులు సీహెచ్ భీమ్ రావు, కలవేణి శ్యామ్, గరిగ స్వామి, తిరుపతి రాజు, ఏనుగు రవీందర్ రెడ్డి, జీవన్ జోయల్, ల్యాగల శ్రీనివాస్, శీలం చిన్నయ్య, ఓపెన్ కాస్ట్ నాయకులు జాన్సన్, రమేష్, అంకుస్, కందుల శంకరయ్య, బెల్లం తిరుపతి పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జెట్టి శంకర్ రావు

## నేడు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు  సెలవు

**- జిల్లా కలెక్టర్ కే హరిత**

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

ఈ నెల 17న శ్రీ సంత్ సేవాలాల్ మాహారాజ్ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్  విద్యా సంస్థలకు సెలవును ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కే హరిత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10 వ తరగతి విద్యార్థులకు ప్రి ఫైనల్ పరిక్షలు వున్నందున వీరికి సెలవు వర్తించదన్నారు. ఈ సెలవుదినంకు బదులు మార్చి 14 రెండో శనివారం రోజున పని దినంగా విద్య సంస్థలు పని చేస్తాయని కలెక్టర్ తెలిపారు.



## ప్రశాంతంగా ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

**ఆసిఫాబాద్,  ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

ఆసిఫాబాద్ మున్సిపాల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించినట్టు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హరిత అన్నారు. సోమవారం  సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరం నుండి వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నిక ప్రక్రియను ఎస్పి నితికా పంత్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం డెవిడ్ లతో కలిసి పర్యవేక్షించారు.  ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపాలిటిలోని  చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను మున్సిపల్ కార్యాలయంలో ప్రశాంతంగా నిర్వహించిన్నట్లు తెలిపారు. ఎల్లాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్య క్రమములో సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి వార్డు సభ్యులకు ప్రత్యేక శిక్షణ తరగతులు

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో మంగళవారం నుంచి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఎంపీడీవో సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 27 వరకు రెండు విడతలుగా ఈ శిక్షణ కొనసాగుతుందని ఆయన తెలిపారు. గ్రామాల్లో పౌర సేవలు, పంచాయతీ రాజ్ చట్టం, సభ్యుల విధులుబాధ్యతలపై ఈ సందర్భంగా అవగాహన కల్పించనున్నారు. తొలి విడతలో అడెపల్లి, డబ్బా, బాబాసాగర్, చింతలమానేపల్లి సహా 10 గ్రామాల ప్రతినిధులకు.. రెండో విడతలో బాలాజీ అనుకోడ, రవీంద్రనగర్, బాబాపూర్ తదితర 9 గ్రామాల సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నారు. సంబంధిత వార్డు సభ్యులందరూ సకాలంలో హాజరై శిక్షణను విజయవంతం చేయాలని ఎంపీడీవో కోరారు.



## చెన్నూరు మున్సిపాలిటీలో కొలువుదీరిన కొత్త పాలకవర్గం

**చెన్నూరు టౌన్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త**

మూడు రోజులుగా చెన్నూరు మున్సిపాలిటీ ప్రజల్లో నెలకొన్న సందేహాలకు తెరపడింది. చైర్మన్ పదవి ఎవరికి కట్టబెడతారు, వైస్ చైర్మన్‌గా ఎవరుంటారు అనే సందిగ్ధానికి మంత్రి వివేక్ వెంకటస్వామి ముగింపు పలికారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయకేతనం ఎగరవేసిన విషయం విదితమే. మున్సిపల్ పీఠం ఎవరికి దక్కుతుందో అన్న పట్టణ ప్రజల ఆలోచనలకు మంత్రి వివేక్ తెరదించారు. ఆదివారం రోజున చెన్నూరు మున్సిపాల్టీలో కొత్త పాలక వర్గం కొలువుదీరింది. చెన్నూరు మున్సిపల్ చైర్ పర్సన్‌గా పెద్దింటి పద్మ, వైస్ చైర్మన్‌గా నాయకపు వినయ్‌లకు మంత్రి వివేక్ పట్టం కట్టారు. వీరితో పాటు మరో 16 మంది కౌన్సిలర్లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను నమ్ముకొని ఓటు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించి, మున్సిపాలిటీలో సుపరిపాలన అందిస్తామని, శాసనంపై ప్రమాణం చేసి తమ పదవులు చేపట్టారు.

## ఘనంగా శివపార్వతుల కళ్యాణం

**జన్నారం, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**

శివపార్వతుల కళ్యాణం జన్నారం మండల కేంద్రంలో గల శ్రీ కేతేశ్వర కంకాలమ్మ శివాలయం ప్రాంగణంలో సోమవారం నాడు శివ పార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా వేద బ్రాహ్మణులచే ఘనంగా జరిగింది. పూజారి భూమయ్య వేద మంత్రోచ్చారణలతో శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. కంకాలమ్మ శివాలయం శివపార్వతుల కళ్యాణ వేడుకల్లో కమిటీ చైర్మన్ ఎమ్మార్ నరసింహారావు, కోశాధికారి పిల్లి మల్లయ్య, గౌరవ అధ్యక్షులు చెలివేరి నర్సయ్య, ఉపాధ్యక్షులు పర్ల కనకయ్య, ఆలయ కమిటీ సభ్యులు సూరనేని కొండయ్య, పోతు సురేష్, పోతురమణ, మదిరే సతీష్, నగురు మహేందర్, పిల్లి అంజయ్య, కోడి జుట్టు రాజన్న, నగురు సతీష్, నగురు నరేష్, సంద కృష్ణ తదితరులు పాల్గొన్నారు కళ్యాణోత్సవంలో భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ అన్నదాన కార్యక్రమం చేపట్టారు.





## భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణను ప్రారంభించిన బెల్లంపల్లి ఏరియా జీఎం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త

రెబ్బెన మండలం గోలేటి లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్నభారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ప్రథమ చికిత్స, హైక్ కార్యక్రమాన్ని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన స్కౌట్ పతాకాన్ని ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజ సేవా అత్యవసర పరిస్థితుల్లో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ సేవలు గొప్పవని అన్నారు. పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు, స్వయం కృషితో ఎదగడం, శారీరక, మానసికంగా దృడత్వం భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ద్వారా పెంపొందుతాయన్నారు. ప్రథమ చికిత్స చేయడం ప్రతి విద్యార్థి నేర్చుకోవాలని సూచించారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు యునిఫామ్స్ పంపిణీ చేశారు. అత్యవసర పరిస్థితులు, ప్రమాదాలు జరిగినప్పుడు అధించే సహాయం, ప్రథమ చికిత్స, కొత్త ప్రదేశాల్లో చాకచక్యంగా ప్రయాణించడం వంటి సేవా కార్యక్రమాలపై మూడు రోజులు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు మచ్చగిరి నరేందర్, డీజీఎం సివిల్ ఎస్.కె మదీనా భాషా, సీనియర్ పిఓ డి. ప్రశాంత్, ప్రధానోపాధ్యాయుడు ఎం. రవితేజ, వ్యాయమ ఉపాధ్యాయుడు బాస్కర్, అన్ని ఏరియాల సింగరేణి పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల కార్పొరేషన్ నగర మేయర్‌గా ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్‌గా సల్ల రమ్య ప్రమాణ స్వీకారం

మంచిర్యాల, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త



మేయర్ ధర్ని మధుకర్



డిప్యూటీ మేయర్ సల్ల రమ్య

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో నూతన మేయర్, డిప్యూటీ మేయర్ పదవీ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. 32వ డివిజన్‌కు చెందిన ధర్ని మధుకర్ మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. 54వ డివిజన్‌కు చెందిన సల్ల రమ్య డిప్యూటీ మేయర్ బాధ్యతలు స్వీకరించారు. నగర కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు హాజరయ్యారు. మొదట మేయర్‌గా ధర్ని మధుకర్‌కు ప్రమాణ స్వీకారం చేయించగా, అనంతరం సల్ల రమ్య వైస్ చైర్మన్‌గా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ నగర సమగ్రాభివృద్ధే తన లక్ష్యమని పేర్కొన్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజలకు పారదర్శక పరిపాలన అందించేందుకు కట్టుబడి ఉన్నామని అన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

మహిళలు, యువత కోసం ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మేయర్, డిప్యూటీ మేయర్‌లకు నాయకులు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. నగరాన్ని ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి మున్సిపల్ ఛైర్మెన్, వైస్ ఛైర్మెన్ పదవులు దక్కించుకున్న కాంగ్రెస్

- చైర్ పర్సన్‌గా దావ స్వాతి, వైస్ చైర్మెన్ రాగంషెట్టి సత్యనారాయణ





బెల్లంపల్లి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త

బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ ఛైర్మెన్ పదవులను ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీనే కైవసం చేసుకుంది. గత ఐదు రోజుల క్రితం క్యాంపుకు వెళ్లిన కాంగ్రెస్ 14, స్వతంత్రులు 5, బీజేపీ1, ఎక్స్ ఆఫీసియో సభ్యుడు ఎమ్మెల్యే గడ్డం వినోద్ మొత్తం 21 మంది సోమవారం ఉదయం 10:45 గంటలకు ప్రత్యేక బస్సు ద్వారా బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. మున్సిపల్ ఎన్నికల అధికారి బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మున్సిపల్ కమీషనర్ సంపత్ రెడ్డి 11 గంటలకు మున్సిపల్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చైర్ పర్సన్‌గా 7వ వార్డు కౌన్సిలర్ దావ స్వాతి రమేష్ బాబు, వైస్ ఛైర్మెన్‌గా 17వ వార్డు కౌన్సిలర్ రాగంశెట్టి సత్య నారాయణ లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సభకు హాజరైన ఎక్స్ అఫిషియో సభ్యునితో పాటు 20 కౌన్సిల్ సభ్యులు చేతులు లేపి చైర్ పర్సన్‌గా దావ స్వాతి పేరును ప్రతిపాదించగా సభ్యులు ఏక గ్రీవంగా మద్దత్తు తెలిపారు. దీంతో ఎన్నికల అధికారి మనోజ్ చైర్ పర్సన్‌గా దావ స్వాతి, వైస్ ఛైర్మెన్ గా రాగం శెట్టి సత్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన దావస్వాతి, రాగం షెట్టి సత్యనారాయణ లకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వినోద్ ఛైర్ పర్సన్, వైస్ చైర్మన్ లు కార్యకర్తలతో కలిసి ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంకు చేరుకున్నారు. ఈ ర్యాలీలో టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ముచ్చర్ల మల్లయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గట్టు మురళీధర్ రావు, మాధవరపు నర్సింగరావు, రుద్రబట్ల సంతోష్, కార్కూరి రాంచందర్, సింగతి సత్యనారాయణ పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి బెల్లంపల్లి అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తా

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

మున్సిపల్ కొత్త పాలక వర్గంతో కలిసి సమిష్టిగా బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. చైర్ పర్సన్, వైస్ ఛైర్మెన్‌లతో కలిసి ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన పాలక వర్గాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు తీసుకు వెళ్లి బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బెల్లంపల్లి పట్టణంలో రానున్న రోజుల్లో అత్యధిక నిధులు తీసుకు వచ్చి పట్టణ అభివృద్ధికి పాటు పడుతానన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి, వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్య నారాయణ, టౌన్ కాంగ్రెస్ మున్సిపల్ కౌ న్సిలర్లు చింతల వసంత, నిచ్చకోల వంశీకృష్ణ, డీకొండ పద్మ, మత్త మారి రాయమల్లు, ఎండీ నిజాముద్దీన్, కంకటి ప్రణీత, గాలి సుమలత, ఇప్ప కుమార స్వామి, పోలు ఉమాదేవి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి వాంఛనీయ సంఘటనలు జరగకుండా బెల్లంపల్లి ఏసిపి ఏ. రవికుమార్, రూరల్ ఇన్స్పెక్టర్ హనూక్, బెల్లంపల్లి టూ టౌన్, 3 టౌన్ ఎస్ఐలు చిలుముల కిరణ్ కుమార్, బి. రామకృష్ణలతో కలిసి భారీ బందోబస్తు నిర్వహించారు.



నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు

## రాష్ట్రపతి నిలయంలో నటరాజ కళాక్షేత్రం విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శన

జన్నారం, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త

హైదరాబాద్ నగరం లోని రాష్ట్రపతి నిలయం నీ కళ సంధ్య ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక మహోత్సవం కార్యక్రమంలో జన్నారం, లక్షెట్టిపేట్ శాఖలకు చెందిన విద్యార్థులు అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. భారతీయ సాంప్రదాయ నృత్యరూపాలలో ప్రత్యేక స్థానం కలిగిన కూచిపూడి ని విద్యార్థులు ఎంతో క్రమశిక్షణ, లయ, తాళ సమన్వయం భావ వ్యక్తీకరణను సమర్థంగా ప్రతిబింబించి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. నృత్యం చేసే సమయంలో వారి ముద్రభినయాలు, నేత్రభినయాలు, హస్తముద్రలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. సంగీతానికి అనుగుణంగా వారు చేసిన నృత్య కదలికలు సభలో కళాత్మక వాతావరణాన్ని కల్పించాయి. ఈ సందర్భంగా నృత్యాన్ని తిలకించిన కళాప్రియులు విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాన్స్ మాస్టర్ నర్మదా గౌడ్ మాట్లాడుతూ ఈ ప్రదర్శన నటరాజ కళాక్షేత్రం యొక్క కళా ప్రస్థానానికి మరొక విశిష్ట ఘట్టంగా నిలుస్తుందని, గురువు శిష్యుల సమిష్టి కృషి ఫలితంగా ఈ నృత్య ప్రదర్శన సాంస్కృతిక వేదికపై చిరస్మరణీయంగా నిలిచిపోతుంది అని అన్నారు.

## మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మంత్రి వివేక్ చిత్రపటానికి పాలాభిషేకం

చెన్నూరు టౌన్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాల్టీలో మున్నూరు కాపు కులస్తురాలు పెద్దింటి పద్మ శ్రీనివాస్ ని, చెన్నూరు మున్సిపల్ చైర్మన్‌గా నియమించినందుకు గాను మున్నూరుకాపు కుల సంఘాల అధ్వర్యంలో ఆదివారం రోజున మంత్రి వివేక్ వెంకటస్వామి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు కులసంగాల నాయకులు మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి ఉన్నత పదవి కట్టబెట్టినందుకు మంత్రి వివేక్ వెంకటస్వామికి, ఎంపి వంశీ కృష్ణకి చెన్నూరు మున్నూరు కాపు సంఘాల నేతృత్వంత్వంలో పాలాభిషేకం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో, సాట్లపల్లి శ్రీధర్ పటేల్ మున్నూరు కాపు రాష్ట్ర కార్యదర్శి, గుర్రం సమ్మయ్య పటేల్ మున్నూరు కాపు రాష్ట్ర కార్యదర్శి, జేక సంజీవ్ హైకోర్టు అడ్వకేట్, వీరితో పాటు కులాసంగాల నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.



# లక్షెట్టిపేట బల్దియాపై మహిళా ముద్ర

**- లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్‌గా అంజలి ప్రమాణస్వీకారం**

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సిపాలిటీ చరిత్రలో నూతన అధ్యాయం మొదలైంది. సోమవారం జరిగిన ఎన్నికల్లో ఇద్దరు మహిళా మణులు ఉన్నత పదవులను అధిష్ఠించారు. మున్సిపల్ చైర్మన్ 2వ వార్డు కౌన్సిలర్ దొంత అంజలి, వైస్ చైర్మన్ 4వ వార్డు కౌన్సిలర్ మోత్కూరి రాజేశ్వరి ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ పీఠంపై ఇద్దరు మహిళలే కొలువుదీరడం పట్టణ చరిత్రలో ఇదే తొలిసారి. సోమవారం రోజున మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అధికారులు చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్న అనంతరం ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వార్డు సభ్యులు కూడా పదవీ ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ అంజలి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, మున్సిపల్ పాలకవర్గం, ప్రజల సహకారంతో లక్షెట్టిపేటను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్ దొంత అంజలి, వైస్ చైర్మన్ మోత్కూరి రాజేశ్వరి

## మహిళల భద్రతే పోలీసు అక్క లక్ష్యం

**- మహిళా కానిస్టేబుల్ గూలే శిల్ప**

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

మహిళల భద్రత, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోలీసు అక్క కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నట్లు మహిళా కానిస్టేబుల్ గూలే శిల్ప తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని శబరిమాత కాలనీలో మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, వేధింపులను అరికట్టడానికి ఉన్న చట్టాలపై ఆమె వివరించారు. ముఖ్యంగా చిన్నపిల్లలపై లైంగిక దాడుల నివారణ చట్టం, మహిళా రక్షణ చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ఆపద తలెత్తినా లేదా వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే 100కు సమాచారం అందించాలని కోరారు. ఆపదలో ఉన్న మహిళలకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.



## ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఆటల పోటీలు

**- జిల్లా అదనపు కలెక్టర్, ఇంచార్జ్ జిల్లా విద్యాధికారి దీపక్ తివారి**

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్, ఇంచార్జ్ జిల్లా విద్యాధికారి దీపక్ తివారి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం నుండి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు హైదరాబాద్ లో జరగనున్న ఆటల పోటీలకు వెళ్లేందుకు వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ లో జరగనున్న ఇండోర్, అవుట్ డోర్ ఆటల పోటీలలో జిల్లా నుండి ప్రత్యేక అవసరాలు గల పిల్లలు హాజరవుతున్నారని తెలిపారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పథకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల స్పోర్ట్స్ ఇన్చార్జి శాంతి కుమార్, ఐఈఆర్పి లు సతీష్, సుజాత, రమణ, ప్రత్యేక విద్యావేత్త మహేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న సర్పంచ్ లింగంపల్లి లతావెంకటేష్

## ఇందిరమ్మ ఇండ్లు వేగవంతంగా నిర్మించుకోవాలి

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**

ఇందిరమ్మ ఇల్లు వేగవంతంగా నిర్మించుకోవాలని అంకత్ పల్లి గ్రామ సర్పంచ్ లింగంపల్లి లతా వెంకటేష్ అన్నారు. సోమవారం రోజు గ్రామ పంచాయతీలోని పలు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. ఎన్నో రోజుల నుంచి వృధాగా ఉంటున్న బోర్వెల్ ను పునరుద్ధరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలోని ప్రతి సమస్యను త్వరితగతంగా పరిష్కరిస్తూ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగంపల్లి లతా వెంకటేష్, హౌసింగ్ ఏఈ. షారోన్, సుంకరి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## లక్షెట్టిపేట ప్రజల పక్షాన బిఆర్ఎస్ ఉంటుంది

**- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్ రావు**

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**

ప్రజల పక్షాన బిఆర్ఎస్ ఉంటుందని పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ రావు అన్నారు. సోమవారం లక్షెట్టిపేటలో బిఆర్ఎస్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా బిఆర్ఎస్ కౌన్సిలర్లు పనిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నూతన ఎన్నికైన కౌన్సిలర్లు పెట్టం తిరుపతి, మైలారపు సుధాకర్, ఎగ్గడి జమున, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ కౌన్సిలర్ సన్మానిస్తున్న విజిత్ రావు



నృత్య కళాకారులతో ఆలయ సిబ్బంది

## శ్రీ విశ్వనాథ ఆలయంలో కూచిపూడి నృత్య కళా వైభవం

**మంచిర్యాల, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**

మంచిర్యాల పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో గల శ్రీ విశ్వనాథ ఆలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ నందిని నృత్యాలయం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఘనంగా జరిగింది. ఫౌండర్ గురువు, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎక్స్‌లెన్స్ అవార్డు గ్రహీత, అన్నం కల్పన తన శిష్య బృందంతో శివతాండవం, భక్తి భావాలను ప్రతిబింబించే నృత్య రూపకాలు అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో, అర్చకులు సమన్వయంతో నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. నృత్య ప్రదర్శన అనంతరం కళాకారుల ప్రతిభను గుర్తించి వారికి అవార్డులు ప్రదానం చేయగా, గురువు కల్పనను ఘనంగా సన్మానించి సత్కరించారు. ప్రతి మహాశివరాత్రికి శ్రీ నందిని నృత్యాలయం శివభక్తితో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కూచిపూడి నృత్య వైభవం మహాశివరాత్రి వేడుకలకు ప్రత్యేక శోభను చేకూర్చిందని భక్తులు, కళాభిమానులు ప్రశంసలు కురిపించారు.




శ్రీరాంపూర్ జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాతాడి శ్రీధర్ రెడ్డి, ఇతర బిఎంఎస్ నాయకులు

## రక్షణ సిబ్బందికి అత్యాధునిక పరికరాలు అందించాలి

**- శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్‌కు బిఎంఎస్ నాయకుల వినతి**

**నస్పూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**

సింగరేణి ఆస్తుల రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న రక్షణ సిబ్బందికి యుద్ధ ప్రాతిపదికన మౌలిక సదుపాయాలు కల్పించాలని బిఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎస్ అండ్ పీసీ పిట్ కార్యదర్శి కొమ్ము బాపు ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ సల్ల జక్కారెడ్డిని సోమవారం కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. సింగరేణిలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి పాలికర్బోనట్ స్టిక్ లు, హైపవర్ టార్చ్ లైట్లు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. ఈ ఆధునిక పరికరాలు అందించడం ద్వారా సంస్థ ఆస్తులను మరింత సమర్థవంతంగా కాపాడవచ్చని వివరించారు. విధుల నిర్వహణలో సిబ్బంది సామర్థ్యాన్ని పెంచేందుకు యాజమాన్యం చొరవ చూపాలని సూచించారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగం పాత్ర ఎంతో కీలకమని శ్రీధర్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ నాయకులు కుమ్మరి చంద్రశేఖర్, కుంట రాజు, ఆకుతోట బాలకృష్ణ, అష్టకాల శ్రీధర్, ఐలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు

**- ఎంపీడీవో అరుణారాణి**

**దిలావర్పూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

దిలావర్పూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ నెల 17 నుండి 21వ తేదీ వరకు వార్డు సభ్యులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అరుణారాణి, ఎంపీఓ గోవర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ తరగతులు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. స్థానిక సంస్థల బలోపేతం, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు, ప్రభుత్వ పథకాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల వార్డు సభ్యులు ఈ శిక్షణ తరగతులకు తప్పనిసరిగా హాజరై, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

### రాజన్న లొద్దిలో కన్నులపండువగా

# శివపార్వతుల కళ్యాణం

**దిలావర్పూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**



ప్రకృతి ఒడిలో, సహ్యాద్రి పర్వత శ్రేణుల మధ్య గలగల పారే సెలయేళ్ల చెంత కొలువుదీరిన రాజన్న లొద్ది రాజరాజేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ పవిత్ర క్షేత్రంలో ఏటా నిర్వహించే సంప్రదాయం ప్రకారం, శివరాత్రి మరుసటి రోజున భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి జంగం నాగనాథ్ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణాన్ని వేదమంత్రోచ్ఛారణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. చుట్టూ ఉన్న కొండలు, అటవీ ప్రాంతం శివనామస్మరణతో మారుమోగింది. ఈ వేడుకను కళ్లారా వీక్షించేందుకు దిలావర్పూర్ మండలంలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. రాజన్న లొద్దిలో ఏళ్ల తరబడి వస్తున్న ఆచారం ప్రకారం.. భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి ఆలయ పరిసరాల్లోనే వంటావార్పు చేసుకున్నారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పకృతి రమణీయత మధ్య జరిగిన ఈ ఆధ్యాత్మిక వేడుక భక్తులకు మరుపురాని అనుభూతిని మిగిల్చింది.

# గోడిసిర్యాల రాజన్న సన్నిధిలో అద్భుతం

### శివరాత్రి వేళ గర్భగుడిలో నాగుపాము ప్రత్యక్షం

**దస్తురాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**



నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని గోడిసిర్యాల శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన ఒక అరుదైన ఆధ్యాత్మిక దృశ్యం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. ఏటా శివరాత్రి పర్వదినాన అర్ధరాత్రి వేళ నాగేంద్రుడు దర్శనమివ్వడం ఈ క్షేత్రం యొక్క విశిష్టత కాగా, ఈ ఏడాది కూడా ఆ సంప్రదాయం పునరావృతమైంది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఆలయ గర్భగుడిలోని శివలింగం సమీపంలో నాగుపాము ప్రత్యక్షమైంది. సాక్షాత్తూ ఆ పరమేశ్వరుడే నాగరూపంలో దర్శనమిచ్చాడని భక్తులు భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. నాగుపాము దర్శనంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగింది. ఈ విశేషాన్ని తమ అదృష్టంగా భావిస్తున్నామని భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లకు పత్తిరెడ్డి అభినందనలు

**సారంగాపూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**



నిర్మల్ మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి, మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అప్పాల కావ్య, వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అప్పాల గణేష్ చక్రవర్తిలను సారంగాపూర్ మండల మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి సోమవారం ఘనంగా సన్మానించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో వారిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పాల కావ్య, గణేష్‌ల నాయకత్వంలో నిర్మల్ పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని వారు నిలబెట్టుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడెల్లి మాజీ సర్పంచ్ రాజేశ్వరరావు, నాయకులు సూర్యం, మండల మీడియా కోఆర్డినేటర్ సురేందర్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ సేవలు గొప్పవి

### - బెల్లంపల్లి ఏరియా జిఎం విజయభాస్కర్ రెడ్డి

**తాండూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :**



మాట్లాడుతున్న జిఎం విజయభాస్కర్ రెడ్డి

సమాజ సేవా, అత్యవసర పరిస్థితుల్లో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ అందించే సేవలు గొప్పవని బెల్లంపల్లి జిఎం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. రెబ్బెన మండలం గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ప్రథమ చికిత్స, హైక్ కార్యక్రమాన్ని సోమవారం జిఎం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు, స్వయం కృషి తో ఎదగడం, శారీరక, మానసికంగా దృఢత్వం భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ద్వారా పెంపొందుతాయన్నారు. ప్రథమ చికిత్స చేయడం ప్రతి విద్యార్థి నేర్చికోవాలని సూచించారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు యునిఫామ్స్ పంపిణీ చేశారు. అత్యవసర పరిస్థితులు, ప్రమాదాలు జరిగినప్పుడు అధించే సహాయం, ప్రథమ చికిత్స, కొత్త ప్రదేశాల్లో చాకచక్యంగా ప్రయాణించడం వంటి సేవా కార్యక్రమాలపై మూడు రోజులు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు మచ్చగిరి నరేందర్, డీజీఎం (సివిల్) మదీనా భాషా, సీనియర్ పిఓ ప్రశాంత్, ప్రధానోపాధ్యాయుడు రవితేజ, వ్యాయమ ఉపాధ్యాయుడు బాస్కర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జాం గురుకులంలో మిన్నంటిన వీడ్కోలు సంబరాలు

### - జ్ఞాపకాల పందిరిలో విద్యార్థినులు

**సారంగాపూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(జాం)లో పదవ, పన్నెండవ తరగతి విద్యార్థినుల వీడ్కోలు సమావేశం సోమవారం అత్యంత ఘనంగా జరిగింది. ఈ వేడుకలో తొమ్మిదవ, పదకొండవ తరగతి విద్యార్థినులు తమ సీనియర్లకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పాఠశాలలో గడిపిన మధుర క్షణాలను, తమ అనుభవాలను వేదికపై పంచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అందరినీ అలరించాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. పిన్సిపాల్ టి.సంగీత మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# క్యాతన్‌పల్లి కౌన్సిల్ ప్రమాణ స్వీకారం వాయిదా

### - ప్రత్యేక అధికారి ప్రకటన

**రామకృష్ణాపూర్, ప్రభాతవార్త**

మున్సిపాలిటీలో ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11న ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి, 13న ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగానే జరిగాయి. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో 22 వార్డులకు గాను అధికార కాంగ్రెస్ పార్టీ కి 7 సీట్లు, బి.ఆర్.ఎస్ పార్టీ కి 10 సీట్లు, బి.ఆర్.ఎస్‌తో పొత్తు పెట్టుకున్న సీ.పి.ఐ పార్టీకి 4 సీట్లు, గెలుపొందగా, ఒక్క స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. సోమవారం కౌన్సిల్ ప్రమాణ స్వీకారం ఉండగా, వాయిదా పడినట్లు ప్రత్యేక అధికారి మందమర్రి తహశీల్దార్ సతీష్ ప్రకటించారు. ఉదయం 11 గంటలకు కౌన్సిలర్లు క్యాతన్ పల్లి పుర కార్యాలయానికి చేరుకోవాలని తెలియజేశామని, 12:30కి ఏ ఒక్క కౌన్సిలర్ రాక పోవడంతో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మంగళవారం (నేటి)కి వాయిదా వేసినట్లు తహశీల్దార్ తెలిపారు.


కౌన్సిల్ ఎన్నిక వాయిదా ప్రకటన చేస్తున్న ప్రత్యేక అధికారి


సమావేశ మందిరంలో కౌన్సిలర్ లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు, చిత్రంలో ప్రత్యేక అధికారి, మున్సిపల్ కమిషనర్